
ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రామోజీకి ప్రముఖుల నివాళి

4లో..

సంపుటి: 2 | సంచిక: 59 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 9 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



"రామోజీ రావు మరణం ఎంతో బాధాకరం . భారతీయ మీడియాలో విప్లవాత్మ క మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు ఆయన. ఆయన సేవలు సినీ, పత్రికారంగాలలో చెరగని ముద్ర వేశాయి.తన అవిరళ కృషి ద్వా రా.. మీడియా, వినోద ప్రపంచాల్లో శ్రేష్ఠమైన ఆవిష్క రణలకు నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయన ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు. ఆయనతో భాషించేందుకు, ఆయన నుంచి అపారమైన జ్ఞానాన్ని పొం దేందుకు అవకాశం రావడం నా అదృష్టం . ఈ విచారకర సమయంలో రామోజీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, అసంఖ్యాక అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా."


- ప్రధాని నరేంద్ర మోదీ

# మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

- అస్వస్థతతో ఆస్పత్రిలో తుదిశ్వాస
- ఫిలిం సిటీకి భౌతిక కాయం తరలింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం రేవంత్
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం
- ఘనంగా నివాళి అర్పించిన ప్రముఖులు


హైదరాబాద్, జూన్8 (ప్రభాత ఉదయం): తెలుగు పత్రికా రంగంలో విప్లవం సృష్టించిన అక్షరం రాలిపోయింది. అనంతలోకాలకు ఎగిపోయింది. మహెూన్నత పత్రికా సామ్రాజ్యాన్ని ప్రజలకు అందించిన రామోజీరావు అనంతలోకాలు వెళ్లిపోయారు. శనివారం తెల్లావారు జామున రామోజీరావు అస్తమయం చెందారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన.. ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం

..మిగతా 2లో



రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీ రావు కన్నుమూశారు. తెలుగు మీడియాతో పలు వ్యాపారాల్లో రాణించిన రామోజీ రావు.. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ తనదైన ముద్రవేశారు. అతి సామాన్యుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీ .. ఆ తర్వాత అత్యంత శక్తివంతుడిగా మారారు. ఆయన ప్రస్థానం ఓ తరానికి స్ఫూర్తి.

## రామోజీ లేని లోటు పూడ్చలేనిది



తెలుగు మీడియా రంగానికి రామోజీరావు విశ్వసనీయత జోడించారన్న సీఎం రేవంత్

ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వైనం

రామోజీరావు మృతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సంతాపం

తెలుగు మీడియాకు ఆయన సేవలు అమూల్యమైనవని ప్రశంసలు

4

## చంద్రబాబు నివాళి

మీడియా రంగంలో ఆయనది ప్రత్యేక శకం

అసామాన్య విజేత అంటూ చంద్రబాబు నివాళి

అమరావతి,జూన్8 (ప్రభాత ఉదయం): ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అస్తమయంపై తెదేపా అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించిన రామోజీరావు మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలో ఉన్న చంద్రబాబు నేరుగా ఫిల్మ్‌సిటీకి చేరుకుని భార్యతో కలసి రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. కొద్ది రోజులుగా

..మిగతా 4లో





రామోజీరావు పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రులు సబితా రెడ్డి, కేటీఆర్

## తెలుగు ప్రజలపై చెరగని ముద్ర రామోజీరావు

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి కేటీఆర్

రాజేంద్రనగర్ ,జూన్ 8(ప్రభాత ఉదయం)మీడియా,సినిమా,వ్యాపార,విద్య రంగాలలో తనదైన చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని మాజీమంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.శనివారం రామోజీ ఫిల్మ్ సిటీ లో ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు పార్థీవదేహం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి సబితా ఇంద్రారెడ్డి నివాళులు అర్పించారు.రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అన్నారు.వారి మృతి వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారం

..మిగతా 2లో



## నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం

మోడీతో ప్రమాణం చేయించనున్న రాష్ట్రపతి

ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాష్ట్రపతి భవన్

సాయంత్రం 7.15 గంటలకు ప్రమాణ కార్యక్రమం

ఢిల్లీ అంతటా భద్రత కట్టుదిట్టం..కమెండోల పర్యవేక్షణ

ఢిల్లీకి చేరుకుంటున్న విదేశీ ప్రముఖులు

2

## లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేతగా రాహుల్

సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

రాహుల్ జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ఆదరణ

ఎన్నికల్లో ఎన్నో రకాలుగా అడ్డంకులు సృష్టించారు

అయినా కాంగ్రెస్ ధైర్యంగా నిలబడి గెలిచింది

సమావేశ వివరాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్

న్యూఢిల్లీ, జూన్ 8 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ లోక్‌సభ పక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి కేసీ వేణుగోపాల్ విరీడియాకు వెల్లడించారు. సిడబ్ల్యూసీ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై, ఎన్నికల ఫలితాలపై చర్చించామన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో కాంగ్రెస్ నేతలను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని

..మిగతా 2లో



ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# మీడియా విలువలను పతాక స్థాయిలో నిలబెట్టింది రామోజీ రావు

### సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి
### ప్రజల పక్షాన నిలబడిన గొప్ప వ్యక్తి రామోజీ రావు
### టియుడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డి ఖాజాపాష (కెపి)
### ఈనాడు దినపత్రికతో మీడియాకు గౌరవం
### ఈనాడు సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్,బాల రాజేష్
### షాద్ నగర్ చౌరస్తాలో రామోజీరావుకు జర్నలిస్టుల శ్రద్ధాంజలి



షాద్ నగర్ చౌరస్తాలో ఈనాడు గ్రూపుల సమస్త చైర్మన్ రామోజీరావుకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

షాద్ నగర్,జూన్ 8 (ప్రభాత ఉదయం):మీడియా విలువలను పతాక స్థాయిలో నిలబెట్టిన ఘనత ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి అన్నారు.శనివారం సాయంత్రం షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో కీర్తిశేషులు రామోజీరావు చిత్రపటానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డి ఖాజపాషా (కేపీ),స్థానిక జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్ బాల రాజేష్ ఎండి అప్సర్,శ్రావణ్ గౌడ్ వివిధ దినపత్రికల సర్క్యులేషన్ ఇన్చార్జిలు శివ,ఈనాడు పాఠకులు నందిగామ మల్లేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ లట్టుపల్లి మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ఒక విలువలు గల జర్నలిజాన్ని సమాజానికి పరిచయం చేసి ఎంతో నిబంధనలతో రామోజీరావు పనిచేశారని ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా సమాజంలో ఆయన చేసిన అనేక కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని మోహన్ రెడ్డి అన్నారు.టీయూడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ..రామోజీరావు మరణ వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని రామోజీరావు మరణం మీడియా,సినీ రంగానికి తీరని లోటు అన్నారు.మీడియా రంగంతో పాటు సినిమా రంగంలో ఎంతో వైవిధ్యంగా సేవలు అందించాలని పేర్కొన్నారు.మయూరి మౌన పోరాటం అనేక సామాజిక స్పృహ చిత్రాలతో పాటు ఆనాటి రాజకీయాల్లో రౌడీయిజంపై ప్రతిఘటన సినిమా నేటి యువతరానికి నచ్చేలా చిత్రం నువ్వే కావాలి ఇలాంటి సినిమాలు నిర్మించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఆయన మృతి మీడియా రంగానికి అతి పెద్ద లోటని అన్నారు.అదేవిధంగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించిన రామోజీ ఫిలిం సిటీ తెలుగువారికి గర్వకారణం అని అన్నారు.సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్,బాల రాజేశ్ మాట్లాడుతూ..సమాజహితం కోసమే అనునిత్యం రామోజీరావు కష్టపడ్డారనీ తెలుగుజాతి కోసం అహర్నిశలు పనిచేశారనీ రామోజీరావు వ్యక్తి కాదు..ఒక వ్యవస్థ అన్నారు.రామోజీరావు కారణ జన్ములు..యుగపురుషుడు.చిత్రపరిశ్రమకు రామోజీరావు ఎనలేని సేవలు చేశారని రామోజీరావు నిర్మించిన వ్యవస్థలు శాశ్వతం అన్నారు.తెలుగుజాతిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారు.రాష్ట్రాభివృద్ధికి ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ముందుకెళ్తాం అన్నారు.ఈనాడు ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని,విజ్ఞానవంతుల్ని చేశారని వారి వల్లనే జర్నలిస్టులకు గొప్ప గౌరవం లభించిందని రంగనాథ్ పేర్కొన్నారు.ఏ పనిలోనూ రామోజీ రావు రాజీపడేవారు కాదనీ రామోజీరావు మొదట్నుంచీ ప్రజల పక్షాన నిలబడిన గొప్ప వ్యక్తి అన్నారు.రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని రామోజీ కుటుంబ సభ్యులు,ఉద్యోగులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము' అన్నారు.



# మీడియా దిగ్గజం రామోజీ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి...

సృష్టించారు. 1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడును ప్రారంభించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం వ్యక్తం చెబుతున్నారు. రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సీడబ్ల్యూసీ సమావేశంలో కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు. ఇదిలావుంటే ఫిలిం సిటీకి తరలివచ్చిన ప్రముఖ నేతలు రామోజీ భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు.

# తెలుగు ప్రజలపై చెరగని ముద్ర రామోజీరావు

మొదటి పేజీ తరువాయి...

వ్యక్తం చేశారు.సాధారణ వ్యక్తిగా జీవనం ప్రారంభించి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదుగుతూ అతిపెద్ద వ్యాపారవేత్తగా ఎదిగారన్నారు.తాను ఏర్పాటు చేసిన వివిధ సంస్థల ద్వారా లక్షలాదిమందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు.పాత్రికేయ సమాజానికి ఒక దిక్సూచిగా ఈనాడు పత్రిక ద్వారా ఉన్నత ప్రమాణాలు పాటించారన్నారు.ప్రపంచంలోని తెలుగు ప్రజలంతా గర్వపడే విధంగా ఎంతో అద్భుతమైన ఫిల్మ్ సిటీ ని నిర్మించిన ఘనత కూడా రామోజీరావుకే దక్కుతుందన్నారు.ప్రజాహితం,సమాజహితం కోసం కృషి చేసిన రామోజీరావు మృతి ఒక్క తెలుగు ప్రజలకే కాకుండా దేశానికి కూడా తీరని లోటన్నారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.రామోజీరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారితో పాటు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి,జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి,మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో
# చేపప్రసాదం ప్రారంభం
### వివిధ రాష్ట్రాల నుంచి భారీగా ప్రజల రాక



హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం): మృగశిరకార్తె ప్రారంభంతో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం అయ్యింది. చేప మందు కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు బిహార్, యూపీ, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వేలాది మందితో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసి పోయింది. మందు కోసం ఆస్తమా బాధితులు పెద్దఎత్తున వస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్నవారికి నాలుగు గంటలకుపైగా సమయం పడుతోంది. భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. జూన్ 9 ఉదయం 11గంటల వరకు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. బత్తిని సోదరులు అందించే చేప ప్రసాదం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అది తీసుకుంటే ఆస్తమా, ఉబ్బసం, శ్వాస సమస్యలు తొలగి పోతాయంటూ కొందరు విశ్వసిస్తారు. దీంతో ప్రతి సంవత్సరం రెండ్రోజులపాటు బత్తిని సోదరులు చేప మందు పంపిణీ చేస్తుంటారు. మృగశిర కార్తె తర్వాత మాత్రమే వారు చేప మందు ఇవ్వడం ప్రత్యేకం. బత్తిని సోదరుల ఇంట్లో ఉన్న బావి నీటిలో ఔషధ గుణాలు ఉంటాయని కొంతమంది విశ్వసిస్తారు. ఆ నీటితో ప్రసాదం తయారు చేయడంతో శ్వాస సంబంధిత బాధితులు ఎగబడుతున్నారు. మందును చేప పిల్లల నోట్లో కుక్కి.. దాన్ని బాధితుల గొంతులో వేస్తారు. దీంతో వారికి శ్వాస సంబంధిత వ్యాధులు తగ్గుతాయని బత్తిని సోదరులు చెప్తుంటారు. కానీ ఈ మందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. చేపమందు కోసం వచ్చే వారి కోసం టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల నుంచి నాంపల్లికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది.




# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 8(ప్రభాత ఉదయం)సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది సూచించారు. శనివారం గద్వాల్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో గద్వాల అర్బన్ ఆరోగ్యశాఖ వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఆశ కార్యకర్త ప్రతి శుక్రవారం డ్రైడే ప్రోగ్రాము నిర్వహించి, ప్రతి ఇల్లు సర్వే చేసి అనుమానిత మలేరియా, డెంగ్యూ చికున్ గునియా, వైరల్ ఫీవర్, మొదలగు వ్యాధులను గుర్తించి జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు. ప్రతి ఆశ డ్రైడే రోజు 100 ఇండ్లు సర్వే చేసి, సర్వే అనంతరం రిపోర్టును జిల్లా అధికారులకు పంపించాలని తెలిపారు అదేవిధంగా, తమ పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా ఉండేటట్లు చూసుకునే విధంగా కాలనీవాసులకు అవగాహన కలిగించాలని, అదేవిధంగా నీరు నిలిచిన ప్రాంతంలో, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. వారానికి ఒకసారి నీటి నిల్వపాత్రలను, డ్రమ్ములలో, తొట్టిలలో , సిమెంట్ ట్యాంకులలో, ప్లాస్టిక్ కంటైనర్ లో, ప్లాస్టిక్ బిందెలలో ,నీటిని పూర్తిగా తీసి, పారబోసి శుభ్రం చేసి, పాకరా పట్టకుండా ఉండేటట్లు చూడాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి కిటికీలకు వెంటిలేటర్ పై, సన్నని జాలీలను బిగించి, దోమలు రాకుండా చూడాలని, చీకటి పడగానే ఇంట్లోకి దోమలు రాకుండా తలుపులు, కిటికీలు మూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కచ్చితంగా ప్రజలందరూ దోమతెరలు వాడేటట్లు అవగాహన కలిగించాలని అదేవిధంగా ఇంటి పరిసరాలలో కాలువలలో చెత్తను వేయరాదని దీనివల్ల నీటి నిల్వలు పెరిగి దోమలు పెరుగుతాయని దీని వలన , మలేరియా డెంగు ,విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. వాడి పడవేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు చిన్న చిన్న కుండలు మరియు రోలు లాంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. ఇంటి పై కప్పు లపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు, మరియు సంపులు ,నీటి కూలర్స్ లలో నీరు నిల్వ ఉండకుండా, వారానికి ఒకసారి శుభ్రపరచుకోవాలని ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది కె మధుసూదన్ రెడ్డి, రామకృష్ణుడు, వరలక్ష్మి ,శివన్న, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ సూపర్వైజర్లు ఆశాలు పాల్గొన్నారు.

# లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేతగా రాహుల్

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. కాంగ్రెస్ పని అయిపోయిందని చాలా మంది కామెంట్స్ చేశారని.. ఎగ్జిట్ పోల్స్‌పై పోరాటం చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి ఎజెండాను పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరించారని కేసీ విమర్శించారు. మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన కృషిని సీడబ్ల్యూసీ సమావేశంలో అభినందించామన్నారు. ఓట్లేసిన ప్రజలకు కాంగ్రెస్ నేతలు అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అన్నీ అబద్దాలు చెప్పారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ఈ సమావేశంలో కాంగ్రెస్ ధన్యవాదాలు తెలిపింది. రాహుల్ గాంధీ చేసిన రెండు యాత్రలు కాంగ్రెస్ గెలుపునకు కలిసి వచ్చాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. తమతో కలిసి వచ్చిన కూటమి నేతలకు సైతం కాంగ్రెస్ ధన్యవాదాలు తెలిపింది. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో కాంగ్రెస్ ముందుంటుందని కేసీ వేణుగోపాల్ ఉద్ఘాటించారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉండాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, కర్నాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుక్విందర్ సింగ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తదితర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్ సభ ప్రతిపక్ష నేతను ఎన్నుకోవడంతోపాటు పలు అంశాలపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో కేరళలోని వాయనాడ్ సీటును, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాల్లో ఘన విజయం సాధించిన రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ప్రతిపాదించారు. త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు. పార్లమెంటులో ప్రతిపక్షనేతగా నాయకత్వం వహించడానికి రాహుల్ సరైన వ్యక్తి అన్నారు. ఎన్నికల ప్రచారం, గ్యారంటీలపై కూడా సమావేశంలో చర్చించామన్నారు. ఎన్నికల సమయంలో బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేసినా, కాంగ్రెస్ నేతలను బెదిరించినా.. బీజేపీకి గట్టి పోటీ ఇచ్చామన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు యోధుల్లా పోరాడారని కేసీ వేణుగోపాల్ అన్నారు.

# నేడు గ్రూప్1 ప్రిలిమ్ పరీక్ష

### ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసి



హైదరాబాద్, జూన్ 8 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గ్రూప్1 ప్రిలిమ్ పరీక్షకు సర్వం సిద్ధమైంది.. ఆదివారం జరగనున్న గ్రూప్ 1 పరీక్ష కోసం 897 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రూప్1 ప్రిలిమనరీ పరీక్ష నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ కీలక ప్రకటన చేసింది. పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం టిజిఆర్‌టిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని.. రవాణా పరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేసి వెల్లడించారు. గ్రూప్1 ప్రిలిమనరీ పరీక్ష రాసే అభ్యర్థుల సౌకర్యార్థం టిజిఆర్‌టిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అభ్యర్థులకు ఆదివారం రవాణాపరంగా అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రాష్ట్రంలోని 897 పరీక్షా కేంద్రాలకు బస్సులను నడపాలని క్షేత్రస్థాయి ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే సంస్థ యాజమాన్యం ఆదేశాల్విడం జరిగిందని సజ్జనార్ తెలిపారు.

### రామోజీరావు ఖ్యాతి
# మరెవరికి సాధ్యం కాదు

### ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి
### రామోజీరావు మృతికి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సంతాపం



షాద్ నగర్,జూన్ 8 (ప్రభాత ఉదయం):ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు సంపాదించిన గొప్ప ఖ్యాతి మరెవరికి సాధ్యపడదని అలాంటి మహోన్నత వ్యక్తి మృతి చెందడం బాధాకరంగా ఉందని ఎమ్మెల్సీ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున రామోజీరావు కన్నుమూశారు.రామోజీరావు మృతిపై సీనియర్ నేత,మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.సామాన్యుడిగా కెరీర్ ప్రారంభించి అత్యున్నత స్థాయికి ఆయన ఎదిగారని జీవితాంతం నిబద్ధత,క్రమశిక్షణతో ఉన్నారని అన్నారు.చేపట్టిన ఏ పని అయినా సరే నైతిక విలువలు పాటించి మిగతవారికి ఆదర్శంగా నిలిచాయాన్నారు.పత్రిక,టీవీ,సినిమా రంగాల్లో రామోజీరావు సాధించిన విజయాలు తెలుగు జాతికి గర్వంగా నిలుస్తాయని కొనియాడారు.తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు చిరస్మరణీయులు అని పేర్కొన్నారు.రామోజీ రావు వామపక్ష భావజాలం కలిగి ఉండేవారనీ రామోజీ రావు మహనీయులనీ రామోజీరావు కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం అని' ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు.

# నేడు ప్రధానిగా మోడీ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ, జూన్ 8 (ప్రభాత ఉదయం): నరేంద్రమోదీ మూడోసారి భారతదేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రధానిగా ప్రమాణం చేస్తారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని, మంత్రులతో ప్రమాణం చేయిస్తారు. మోడీ వరుసగా మూడోసారి ప్రమాణం చేయడం ద్వారా తొలిప్రధాని నెహ్రూ రికార్డును సమం చేయబోతున్నారు. ఇప్పటికే 2014, 2019ల్లో ఆయన రెండు పర్యాయాలు ప్రధానిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మరోసారి ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టం కట్టడంతో.. ఎన్డీఏ ఎంపీలంతా కలిసి మోదీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. దాంతో ఆయన మూడోసారి పీఎంగా ప్రమాణస్వీకారం చేసేందుకు సిద్ధమయ్యారు. సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ పార్లమెంటరీ పార్టీ తన నాయకుడిగా ఎన్నుకున్న తర్వాత జూన్ 7న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని నరేంద్ర మోదీని తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధికారికంగా కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే గెలుపుతో మూడోసారి ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. 2014, 2019లో కాకుండా ఈ సారి మ్యాజిక్‌ఫిగర్(272)ని బీజేపీ స్వతహాగా సాధించలేకపోయింది. 240 సీట్ల వద్దే ఆగిపోయింది. దీంతో కూటమిలోని తెలుగుదేశం(టీడీపీ), జనతాదళ్ యునైటెడ్(జేడీయూ), శివసేన కీలకంగా మారాయి. మొత్తం 543 ఎంపీ సీట్లలో ఎన్డీయేకి ప్రస్తుతం 293 ఎంపీ బలం ఉంది. ఇదిలా ఉంటే మోడీ 3.0 సర్కార్‌లో మిత్రపక్షాలకు బెర్తులు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. చంద్రబాబు నాయుడు టీడీపికి నాలుగు మంత్రిత్వ శాఖలు, నితీష్ కుమార్ జేడీయూకి 2 మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేడీయూ నుంచి ఇద్దరు సీనియర్ నేతలైన లాలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ల పేర్లను ప్రతిపాదించింది. ప్రస్తుతం టీడీపికి 16, జేడీయూకి 12 సీట్లు ఉన్నాయి. ఇదిలావుంటే అనధికార సమాచారం మేరకు మోడీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తదితరులు ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న తొలి వ్యక్తిగా నరేంద్రమోదీ గుర్తింపు పొందారు. ప్రమాణస్వీకారం నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ పరసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అదేవిధంగా భద్రతా కారణాల రీత్యా ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా కూడా ప్రకటించారు. డ్రోన్‌లు, పారా గ్లైడర్‌లు, ఎయిర్ బెలూన్స్ లాంటివి ఎగుర వేయకుండా నిషేధం విధించారు. కాగా మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్, మాల్దీవ్స్ తదితర దేశాల అధినేతలు హాజరుకానున్నారు. దీంతో భద్రత కోసం పలు ప్రాంతాల్లో రహదారులన్నింటిని మూసివేయనున్నారు. ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

### ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలు, కమాండోలు, డ్రోన్లు, స్నిపర్లతో బహుళ స్థాయి భద్రతను ఏర్పాటు

చేస్తున్నారు. మూడోసారి భారత ప్రధానిగా నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం లో భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన ప్రముఖుల కూడా పాల్గొనబోతున్నారు. దీనిలో సార్క్ దేశాల అతిథులను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతున్నప్పుడు అతిథులకు హోటల్‌కు వెళ్లే మార్గం పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. ఇది కాకుండా పొరుగు దేశాలైన భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, మారిషస్, సీషెల్స్ దేశాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. అతిథులందరి భద్రత కోసం తాజ్, లీలా, ఐటీసీ మౌర్య, క్లారిడ్జ్ వంటి హోటళ్లను ఇప్పటికే భద్రత పరిధిలోకి తీసుకున్నారు. ఢిల్లీలో జరగనున్న ఈ ప్రమాణ స్వీకారోత్సవ భద్రతకు సంబంధించి పారామిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీసులతో పాటు కమాండోలను రాష్ట్రపతి భవన్‌తో పాటు పలు కీలక ప్రదేశాల చుట్టూ మోహరిస్తామని భద్రతా అధికారి తెలిపారు. ఇదిలావుంటే నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఢిల్లీ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆమెకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒకరోజు ముందుగానే శనివారం ఆమె ఢిల్లీ వచ్చారు. విమానాశ్రయానికి చేరుకున్న షేక్ హసీనాకు.. అధికారులు ఘనస్వాగతం పలికారు. విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించిన వివరాల మేరకు.. మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘే, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్, భూటాన్ ప్రధాని తోబ్గే తదితర విదేశీ ప్రముఖులు హాజరుకానున్నారు. .ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జీ20 సమావేశాల తరహాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ము విందు ఏర్పాటు చేశారు.

# గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

బుద్వేల్, జూన్8(ప్రభాత ఉదయం): ఈ నెల 9న నిర్వహించబడే తెలంగాణ రాష్ట్ర గ్రూపు -1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ , పరీక్షల నిర్వహణ అధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. పరీక్ష ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. విద్యార్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్ష హాల్లోకి అనుమతించబడుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకొని రావాలన్నారు. 10 గంటల తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగదన్నారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను, షూస్, చేతి గడియారం ధరించరాదన్నారు. విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని గుర్తు చేశారు. బయోమెట్రిక్ హాజరు ను నమోదు చేసుకొని విద్యార్థుల ఫలితాలను నిలిపివేయబతుందని టీజీపీఎస్ సీ అధికారులు తెలిపారు. ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ లో 312 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని పరీక్ష నిర్వహణ అధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల పరిశీలకులు వేణుగోపాల్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ హరిప్రియ , స్పెషల్ ఇన్విజిలేటర్లు మాన్య, స్వప్న మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ఏసీపి శ్రీనివాస రావు, ఇనిస్పెక్టర్ నాగేంద్రబాబు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.




ఏర్పాట్లను పర్యవేశిస్తున్న ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ బి. నాగేంద్ర బాబు



రామోజీరావు చేతుల మీదుగా జర్నలిజం కోర్స్ సర్టిఫికెట్ అందుకుంటున్న మ్యాక్స్ బాబు

## మహా మనిషి.. ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకి అశ్రునివాళి

హైదరాబాద్, జూన్8(ప్రభాత ఉదయం) నా జీవితం లో జన్మనిచ్చిన తల్లితండ్రుల తర్వాత స్థానం ఈనాడు గ్రూప్ ల సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు దేనిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ పిఆర్ఓ మాక్స్ బాబు అన్నారు. శనివారం ఈనాడు గ్రూపుల సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి సందర్భంగా మాక్స్ బాబు ప్రగాఢ అంతా పని తెలియజేశారు. ఈ సందర్భంగా మ్యాక్స్ బాబు మాట్లాడుతూ... మొదటి సారి 1997 లో ఈనాడు జర్నలిజం స్కూల్ ఇంటర్వ్యూ లో వారిని కలిసాను. వారే నన్ను ఇంటర్వ్యూ చేశారన్నారు. కిరణ్ కూడ ఉన్నారు. ఈటీవీ లో విలేఖరి గా ఢిల్లీ,హైదరాబాద్ ల లో పని చేసిన ఎనిమిదేళ్ల లోనూ వారిని కొన్నిసార్లు కలిసాను. ఈటీవీ నుంచి బయట కి వచ్చాక కూడ కొన్నిసార్లు కలిసి మాట్లాడే అదృష్టం నాకు కలిగిందని ఈ సందర్భంగా మాక్సి బాబు గుర్తు చేశారు. ప్రస్తుత నా వృత్తి, వ్యక్తిగత జీవితం పై ఈనాడు, ఈటీవీ, చైర్మన్ రామోజీరావు ప్రభావం చాలా ఉందన్నారు.



## జూరాలకు స్వల్పంగా వరద

గద్వాల జిల్లా ప్రతినిధి,జూన్8(ప్రభాత ఉదయం)ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, త్రాగు నీటి అవసరాలకు వరప్రదాయంగా మారిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. గత కొన్ని రోజులుగా జూరాల ప్రాజెక్టు ఎగువన తెలంగాణ, కర్ణాటక పరిసర ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండటంతో జూరాలకు వరద మొదలైంది. శనివారం సాయంత్రానికి 3,305 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. గత సంవత్సరం వర్షాకాలం సీజన్ లో ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో కర్ణాటక జలాశయాలు పూర్తి స్థాయిలో నిండలేదు. యాసంగికి ముందే జూరాలకు వరద నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకొని ఇక్కడి అధికారులు తాగు నీటి అవసరాల కోసం యాసంగి సీజన్ లో రెండో పంటకు వారబంధీ ద్వారా నీటి విడుదల చేశారు. ఒకానొక్క దశలో జూరాల ప్రాజెక్టు డెడ్‌స్టోరేజ్‌కు దిశ కు చేరింది. తాగు నీటి అవసరాల కోసం కర్ణాటక జలశయాల నుంచి 1.8టిఎంసి ల నీటిని గత మే నెలలో అక్కడి అధికారులు విడుదల చేశారు. ఈ సీజన్ లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదికి స్వల్పంగా వరద మొదలైంది. ఈ సీజన్‌లో వరద ప్రవాహం స్వల్పంగా పెరగడంతో 3,305 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో శనివారం సాయంత్రం పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుతం 315.360 మీటర్లు, 4.30 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఎగువ ప్రాంతం నుంచి 3,305 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎస్సై చంద్రకాంత్

అలంపూర్/ ఇటిక్యాల,జూన్8(ప్రభాత ఉదయం) : జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి నుండి గద్వాల వెళ్లే దారిలో దయ్యాలవాగు సమీపంలో ఓ వ్యక్తి బైకుపై వెళ్తూ మూర్ఛ వ్యాధితో రోడ్డుపై పడిపోయాడు. గద్వాలకు మీటింగ్ నిమిత్తం మానవపాడు ఎస్సై చంద్రకాంత్ తన పోలీస్ సిబ్బందితో వెళ్తుండగా ఈ సంఘటన కనిపించింది. ఎస్సై చంద్రకాంత్ వెంటనే స్పందించి కాసేపు అక్కడే నిలుచొని చికిత్స నిమిత్తం గద్వాల ఆసుపత్రికి వాహనంలో తరలించి మానవత్వం చాటుకున్నారు.





ఈనాడు, ఈటీవీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు కొన్ని వాళ్ళ అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## నేటి తరానికి మార్గదర్శి రామోజీరావు: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, జూన్8(ప్రభాత ఉదయం) నేటి తరానికి మార్గదర్శి రామోజీరావు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరామ్ ఘర్ చౌరస్తా లో ఈనాడు, ఈటీవీ గ్రూపుల అధినేత రామోజీరావు మృతి సందర్భంగా చిత్రపటానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి తెలుగు సమాజానికి తీరని లోటు. ప్రజా పక్షపాతిగా, జనహితమే తన అభిమతంగా జీవితాంతం నిబద్ధతతో పని చేసిన రామోజీ నేటి తరానికి మార్గదర్శి. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాను... రామోజీ అస్తమయంపై వారి కుటుంబ సభ్యులకు, సానుభూతిని తెలియజేస్తున్నాను. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్నారు.



## జాతీయ లోక్ అదాలత్‌లో 3,559 కేసుల పరిష్కారం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్8 (ప్రభాత ఉదయం)సుప్రీంకోర్టు ఆదేశానుసారం శనివారం గద్వాల కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ ఆదాలత్ లో మొత్తం 3,559 కేసులు పరిష్కా రమైనట్లు లోక్ అదాలతో చైర్మన్, జిల్లా న్యాయమూర్తి కె. కుష తెలిపారు. వీటిలో 3,018 క్రిమినల్ కేసులు, 13 సివిల్ కేసులు, 23 సైబర్ క్రైమ్ కేసుల మరియు 2 ఎక్సైజ్ కేసులు, 3 బ్యాంక్ ప్రిలిటిగేషన్ కేసులు, విద్యుత్ పిఎల్ సి 500, వీటిలో %=o%.7,56, 500/- ఫైన్ ద్వారా వసూలు చేసినట్లు, ఇరువర్గాల వారిని రాజి కుదిర్చి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంట కవితాదేవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి ఉదయ్ నాయక్, అడిషనల్ పిపి త్రిపాఠి, ఎస్ఐలు, బ్యాంక్ అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



## తండాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

### ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి

### రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం..

కొత్తూరు,జూన్ 08 (ప్రభాత ఉదయం):మండలంలోని అన్ని తండాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కొత్తూరు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని వైఎం తండాలో శనివారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఎంపిపి నిధులు నుండి రూ.4 లక్షలతో మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అరుణ రమేష్,మాజీ ఉపసర్పంచ్ లు దశరథ్ నాయక్,వాల్య నాయక్,ఎంపిటిసి పాత్లావత్ డాకీ,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్,జయేందర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,రాజు గౌడ్, నరేందర్,రవి, హనుమంతు,కోఆప్షన్ మెంబర్ రాములు,నర్య నాయక్,నరేష్ నాయక్, బాలు, రాంచంధర్, తుల్చా,సేవ్య,తండావాసు లు తదితరులు పాల్గొన్నారు.




లోక్ అదాలత్ లో తీర్పు వెల్లడిస్తున్న జడ్జి నీలిమ

## లోక్అదాలత్‌తో ప్రజలకు ఎంతో మేలు

### న్యాయమూర్తి నీలిమ

రాజేంద్రనగర్,జూన్08(ప్రభాత ఉదయం) లోక్అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , 11 వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ 11 వ మెట్రోపాలిటన్ కోర్టులో మెగా లోక్అదాలత్‌ను నిర్వహించారు. ఈలోక్ అదాలత్‌లో 10,437 కేసులను పరిష్కరించారు. ఇందులో రాజీపడిన కేసులు 144, అడ్మిషన్ కేసులు 188,డంకన్ డ్రైవ్ కేసులు 1521,ఇ-పెట్టి కేసులు 8330 విద్యుత్ చౌర్యం కేసులు 253,1 బ్యాంకు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ...సివిల్, క్రిమినల్,కుటుంబ వివాదాల్లో క్షణికావేశాలకు లోనై చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని కేసులలో ఇరుక్కుని ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని,వాటి పరిష్కారానికి లోక్అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజీ చేస్తున్న కేసులలో కోర్టుకు చెల్లించిన ఫీజులు తిరిగి కక్షిదారులకు అందిస్తామన్నారు. లోక్అదాలత్‌లో పరిష్కరించబడిన కేసుల విషయంలో అప్పీల్ చేసుకునే అవకాశం లేదన్నారు. మనపట్ల మనం బాధ్యతగా ఉండాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి నీలిమ అన్నారు. ఈ లోక్అదాలత్‌లో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్,స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రానోజి, ఏపీపీలు ప్రవీణ్ నాయక్,సంగీత,బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం వెంకట్ రెడ్డి,కార్యదర్శి శ్రీధర్ రెడ్డి,లోక్అదాలత్ సభ్యులు సుదర్శన్,సుధాకర్ రెడ్డి,సుజాత, వరప్రసాద్,శ్రీనివాసులు,కోర్టు సిబ్బంది వెంకటరంగారెడ్డి,నరేష్ గౌడ్,సంబంధిత ఠాణాల ఎస్ హెచ్ ఓ లు,సిబ్బంది,బార్ అసోసియేషన్ సభ్యులు,పారా లీగల్ వాలంటీర్ ఇతరులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

### డిసి రవి కుమార్

### బహిరంగ ప్రదేశాల్లో చిత్తం వేస్తే భారీ జరిమానా తప్పదు తప్పనిసరిగా తడి,పొడి చెత్త వేరు చేసి ఆటో రిక్షాకు అందించాలి:డిసి రవికుమార్

రాజేంద్రనగర్,జూన్ 8(ప్రభాత ఉదయం)పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యతని రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రగర్ సర్కిల్ మైలారేవ్పల్లి డివిజన్ లో సిబ్బందితో కలిసి చెత్తను తొలలించి పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని అన్నారు. తడి,పొడి చెత్త వేరు చేసి ఆటోలలో వేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనబాధ్యతని ఎవ్వరైన చెత్తను బహిరంగ ప్రదేశాలల్లో వేస్తే జరిమాన విధించడం జరుగుతుందని అన్నారు. స్వచ్ఛత రాజేంద్రనగర్ కు ప్రతి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపశమనం

### కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్

రాజేంద్రనగర్,జూన్ 8(ప్రభాత ఉదయం):దీర్ఘకాలిక వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రిలో స్తోమత లేని నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరం ఎంతగానో దోహదపడుతుందని నార్సింగ్ మున్సిపాలిటీ నాల్గవ వార్డు కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్ తెలిపారు. శనివారం కోకాపేట్ 4 వార్డు పోచమ్మ బస్తీలో న్యూ ఇరా డయాగ్నస్టిక్ సహకారంతో ఉచితంగా పేద ప్రజలందరికి బీపీ,షుగర్,కొలెస్ట్రాలు వంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని నార్సింగి మున్సిపాలిటీ నాలుగవ వార్డు కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మానవ జీవితంలో కొందరిని దీర్ఘకాలికంగా వేధిస్తున్న మొండి వ్యాధులకు ఉచిత వైద్యం శిబిరం ద్వారా మెరుగైన వైద్యం అందుతుందని ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరా డయాగ్నస్టిక్ వైద్యులు,కోకాపేట గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రామోజీకి ప్రముఖుల నివాళి





## రామోజీ మృతి తెలుగుజాతికే తీరని లోటు

### నివాళి అర్పించిన నటుడు చిరంజీవి

రామోజీరావులో అందరూ గంభీరమైన వ్యక్తిని చూసుంటారని.. తాను మాత్రం చిన్న పిల్లాడిని చూశానని సినీ నటుడు చిరంజీవి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆయన పార్థివదేహానికి నివాళులర్పించిన తర్వాత చిరంజీవి మీడియాతో మాట్లాడారు. రామోజీరావుకు పెన్నులు అంటే చాలా ఇష్టం. ప్రజారాజ్యం పార్టీ నడుపుతున్న సమయంలో ఆయనకు ఒక పెన్ను బహూకరించా. దాన్ని చూసి మురిసిపోయారు. ఆయన దగ్గరున్న పెన్నుల కలెక్షన్ నాకు చూపించారు. తన ఆలోచనలకు తగినట్లుగా వాటిని వినియోగిస్తూ అక్షర రూపంలో పెట్టేవారు. ఆశయాలను నెరవేర్చుకునేందుకు ఆయన చేసే ప్రయత్నం అంతా ఇంతా కాదు. రామోజీరావు మృతి ఆయన కుటుంబానికే కాదు.. తెలుగు జాతికి తీరని లోటు. ఒక మహావ్యక్తిని, శక్తిని కోల్పోయాం‘ అని చిరంజీవి అన్నారు.

## రామోజీ మృతికి ఎడిటర్స్ గిల్డ్ సంతాపం

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు (88) మృతికి ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఆయనో మార్గనిర్దేశకుడని కొనియాడింది. ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. ఎడిటర్స్ గిల్డ్ మాజీ అధ్యక్షుడు రామోజీరావు మరణం విచారకరం. మీడియా మెఘల్‌గా ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన రామోజీరావు ఎన్నో మార్గాల్లో మనందరికీ మార్గనిర్దేశకులు. నిజాన్ని నిర్భయంగా మాట్లాడే గొప్ప వ్యక్తి. ఆయనో ఐకాన్. మీడియా రంగానికి ఆయన చేసిన కృషి.. దేశవ్యాప్తంగా జర్నలిస్టులందరిలో నిరంతరం స్ఫూర్తి కలిగిస్తుందని ఎడిటర్స్ గిల్డ్ తమ ప్రకటనలో పేర్కొంది. 1987లో రామోజీరావు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. పత్రికాస్వేచ్ఛ అణచివేతకు అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించడంలో కీలకపాత్ర పోషించారు.















## చంద్రబాబు నివాళి

మొదటి పేజీ తరువాయి...

అనారోగ్యంతో ఉన్న ఆయన తిరిగి కోలుకుంటారని తామంతా భావించామని.. కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటని చంద్రబాబు అన్నారు. సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని పేర్కొన్నారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. మీడియా రంగంలో రామోజీరావుది ప్రత్యేకమైన శకం అని చంద్రబాబు కొనియాడారు. ఎన్నో సవాళ్లను, సమస్యలను అధిగమించి...ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు తన ప్రయాణంలో అనుక్షణం ప్రజల మంచి కోసం, సమాజ హితం కోసం రామోజీరావు పనిచేశారని అన్నారు. మీడియా రంగంలో ఆయనొక శిఖరమని, ఆయన ఇక లేరు అనే విషయాన్ని తాము జీర్ణించుకోలేక పోతున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రామోజీరావుతో తన 4 దశాబ్దాల అనుబంధాన్ని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. మంచిని మంచి, చెడును చెడు అని చెప్పే ఆయన తీరు.. తనను ఆయనకు ఎంతో దగ్గర చేసిందని అన్నారు. సమస్యలపై పోరాటంలో ఆయన తనకు ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రజలకు మంచి పాలసీలు అందించే విషయంలో తాను రామోజీ సూచనలు, సలహాలు తీసుకునేవాడినని గుర్తు చేసుకున్నారు. రామోజీ అస్తమయంపై ఆయన కుటుంబ సభ్యులకు, ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రబాబు ప్రార్థించారు.





## రామోజీ లేని లోటు పూడ్చలేనిది

మీడియా దిగ్గజం, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అస్తమయంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. రామోజీరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రామోజీరావు మృతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా సంతాపం తెలియజేశారు. మీడియా రంగానికి ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఆయన మరణ వార్త తీవ్ర విషాదానికి గురి చేసిందన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## రామోజీ రావు పేదల పక్షపాతి

### నివాళి అర్పించిన నారా లోకేశ్

మిడియా దిగ్గజం, ప్రముఖ పారిశ్రామిక వేత్త రామోజీ రావు మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'రామోజీ రావు పేదల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. 'అలు పెరుగని అక్షర యోధుడు. జనహితమే తన అభిమతంగా అనుకున్నారు. జీవితాంతం నిబద్ధతతో పనిచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్ఫూర్తితో పనిచేశారు అని' నారా లోకేశ్ అభిప్రాయ పడ్డారు. మృతిపై హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. 'తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు మకుటం లేని మహారాజు. పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శిగా నిలిచారు. చిత్రసీమలో అదేవిధంగా వెలిగిచారు. తెలుగు నేలపై అతిపెద్ద స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మించారు. తన తండ్రి ఎన్టీఆర్‌తో రామోజీరావుకు ప్రత్యేక అనుబంధం ఉండేది. రామోజీ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి కలుగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా అని' నందమూరి బాలకృష్ణ అభిప్రాయ పడ్డారు.

## నేడు చిత్ర పరిశ్రమ బందుకు పిలుపు

### రాజమౌళి, కీరవాణి,రాజేంద్రప్రసాద్ తదితరుల నివాళి

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి తరలివెళ్లి మీడియా సంస్థ అధినేతకు నివాళులర్పిస్తున్నారు. రామోజీ రావు మరణ వార్త సినీ ఇండస్ట్రీని తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో రామోజీ మృతి పట్ల సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణానికి సంతాప సూచికంగా ఆదివారం చిత్ర పరిశ్రమకు బంద్ ప్రకటించారు. ఈ మేరకు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటన విడుదల చేసింది. ఆదివారం అన్ని షూటింగ్‌లూ నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇదిలావుంటే ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్‌సిటీకి తరలించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రామజౌళి, ఆయన భార్య రమా రాజమౌళి, కీరవాణి, రాజేంద్ర ప్రసాద్, ఏపీ మాజీ మంత్రి పరిటాల సునీత, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, బ్యాడ్మింటన్ కోచ్ పులలెల గోపీచంద్ తదితరులు రామోజీ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.